**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేదీ : జనవరి 20, 2017.**

**గౌరవ కమీషనర్ గారికి,**
ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ కమీషనర్ గారికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : కృష్ణా జిల్లా నందివాడ మండలంలో అనుమతులు లేని చేపల/ రొయ్యల చెరువులపై చర్యల గురించి...**

కృష్ణా జిల్లా గుడివాడ నియోజకవర్గం నందివాడ మండలంలో 32 వేల ఎకరాలకు గాను 27 వేల ఎకరాల వరకు చేపల, రొయ్యల చెరువులుగా మారిపోయాయి. అత్యధిక చెరువులు ఈ మండలంలో ప్రభుత్వ నిబంధనలకు (7,15(2013), 15 (2015) 48 వంటి జి.వోలు) విరుద్ధంగా త్రవ్వబడ్డాయి. చేపల చెరువులకు మురుగు కాలువ సౌకర్యం వుంటేనే పర్మిషన్ ఇవ్వాలన్న నిబంధన ఇక్కడ అమలు కాలేదు. పంట కాలువల్లోకే చెరువుల్లోని కాలుష్య కారక నీటిని వదులుతున్నారు. కాలుష్య కారక నీటిని పంటకాలువల్లోకి ఏళ్ళ తరబడి వదిలేస్తున్నందున కాలుష్య పరిస్థితి తారా స్థాయికి చేరింది. త్రాగునీరేగాక వాడకం నీరు కూడా కలుషితం అయ్యాయి. చర్మవ్యాధులు, జీర్ణకోశ వ్యాదులు వంటివి విస్తారంగా వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. కాలుష్య నీరు త్రాగి గేదెలు ఈసుకపోతున్నందున పశుగణం మండలంలో తగ్గిపోయింది. చెట్లు బ్రతకడం లేదు. చేపల చెరువుల గట్టుల్లో ఒక్క వేప చెట్టు కూడా లేదు. పచ్చి గడ్డి సైతం గట్లమీద రావడంలేదు. వీటికి తోడు భూమిలేని కూలీలకు ఉపాధి సమస్య తీవ్రమైంది. వరి ఎకరానికి 100 నుండి 120 పని దినాలు లభ్యం అవుతుంటే చేపల చెరువుకి ఎకరాకి ఒకరు కూడా అవసరం లేదు. ప్రజలు పెద్దఎత్తున వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ మండలంలో జనాభా సంఖ్య తగ్గిపోతున్నది. ఒక్క ఇలపర్రు గ్రామ పంచాయతీలో గత 15సంవత్సరాల ఇవతల ఒక ఎంపిటీసి తగ్గిపోయింది.

ఇన్ని సమస్యలకు కారణం ప్రభుత్వ నిబంధనలను ఖాతరు చేయకుండా, అనుమతులు లేకుండానూ వేల ఎకరాలు ఆక్వా చెరువుల క్రింద మారిపోవడమే. అందువలన వెంటనే ఈ మండలంలో చట్టం అమలు తీరుపై విచారణ జరిపించాలని కోరుతున్నాం. అక్రమాలకు పాల్పడ్డ యజమానులను కఠినంగా శిక్షించాలని, అలాంటి చెరువుల లైసెన్సులు రద్దు చేయాలని కోరుతున్నాను.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి